బిల్డర్ అదృశ్యం

బండి ప్రవీణ్

అంబర్‌పేట,మార్చి 17: ఇంట్లోంచి బయటకు వెళ్లిన బిల్డర్ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ బి.జగదీశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట ప్రాంతానికి చెందిన బండి ప్రవీణ్‌కుమార్(51) బిల్డర్. ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన వ్యాస్

టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కాంగ్రెస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ కలిసి పుష్పగుచ్చాన్ని అందించారు. రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నందకిశోర్ వ్యాస్ మున్షీని కలిశారు మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రోహిన్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌యాదవ్, శశాంక్‌రెడ్డి పాల్గొన్నారు.

– అబిడ్స్, మార్చి 17

ఉచిత వైద్య శిబిరం

నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కామినేని దవాఖానకు చెందిన వైద్యులు గార్డెన్‌కు వచ్చే వాకర్స్‌కు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా పర్యవేక్షించగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. గార్డెన్ వాకర్స్ పాల్గొన్నారు. – అబిడ్స్, మార్చి 17

పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలి

రాంనగర్‌లో పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 17: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ ప్రధాన మార్గంలో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం పరిశీలించారు. డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడుతున్న తీరును వాకబు చేసి తెలుసుకున్న ఆయన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రధాన మార్గంలో డ్రైనేజీ పైపులైన్ శిథిలావస్థకు చేరడంతో గత ఏడాదిన్నర కాలంగా మురుగు నీటి లీకేజీ సమస్య తలెత్తుతుందని, ప్రత్యేక చొరవ తీసుకొని ఇటీవల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ అస్లాం, సురేందర్, వెంకట్‌రామ్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి జాతీయ బ్యాంక్‌గా చేయాలి

భిక్షమయ్యను సన్మానిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

చిక్కడపల్లి, మార్చి17 : దేశంలో ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పాటు చేయాలని ఆ లిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్. వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీజీవీబీఈయూ మాజీ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కారింగు భిక్షమయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. గ్రామీణ బ్యాంకుల్లో పనిచేసే ఉగ్యోగులకు వాణిజ్య బ్యాంకులకు ఉద్యోగులకు వ్యత్యాసం లేకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా భిక్షమయ్యను సన్మానించారు. ఎపీటీఆర్ఆర్ఈఎ అధ్యక్షుడు బి.రవికాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి, ఎపీజీవిబిఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వేణురావు, రాజు, కె.కె. మక్కడ్, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

బీసీల హక్కులను కేంద్రం అణిచివేస్తున్నది : కృష్ణయ్య

విజయ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ

కాచిగూడ, మార్చి 17: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జి.విజయ్‌కుమార్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని ఆర్.కృష్ణయ్య అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు లేక పోవడంతో బీసీలు అన్ని రంగాల్లో వెనుబడి ఉన్నారని ఆరోపించారు. బీసీలకు రావాల్సిన రాజ్యాంగపరమైన హక్కులను కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, నందగోపాల్, రాజ్‌కుమార్, రామకృష్ణ, జయంతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలకమర్తికి ఘన నివాళి

సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

ముషీరాబాద్, మార్చి 17: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని చిలకమర్తి లక్ష్మీనరసింహం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకర నారాయణ, తంగిరాల చక్రవర్తి, పబ్బా వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ రెడ్డికి సత్కారం

శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 17: సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆవరణలో మాతృదేవోభవ శీర్షికన నిర్వహించిన కార్యక్రమంలో నృత్య గురువు రేణుకా ప్రభాకర్ శిష్య బృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని ఏపీ ప్రాథమిక విద్య కమిషన్ పర్యవేక్షకుడు జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై సత్కరించారు. సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ దేవసేన, పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సి. హెచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మార్చి 17: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఆదివారం పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే స్వచ్ఛంద సంస్థలకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ వెంకటేశ్, డాక్టర్లు పి. పుల్లారావు, ఎం. యాదగిరి, గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కరాటే మెగా బెల్ట్ అవార్డుల ప్రదానం

అవార్డులు ప్రదానం చేస్తున్న సినీ నటుడు సుమన్, ఎంఎన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్, మార్చి 17: అడిక్‌మెట్ లలితానగర్ గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు మెగా బెల్ట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు సుమన్, గ్రేటర్ బీఆర్ఎస్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెగా బెల్ట్‌లు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విక్కీ మాస్టర్, శివానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను ఖండిస్తున్నాం ..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నగర యువజన విభాగం నాయకుడు రవీంద్ర కోక, భోలక్‌పూర్ మైనారిటీ సెల్ నాయకుడు జునేద్ బాగ్దాది అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వెంటనే కవితను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ జగన్, గడ్డం ప్రవీణ్, భరకం కృష్ణ, ఆంజనేయులు, కొమ్ము రాజేశ్, శ్యామ్, రాజమౌళిగౌడ్ పాల్గొన్నారు. – కవాడిగూడ

రాందాస్ అగర్వాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి..

దుస్తులు పంపిణీ చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

కవాడిగూడ, మార్చి 17: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వ్యవస్థాపకుడు దివంగత రాందాస్ అగర్వాల్ ఆశయ సాధనకు వైశ్యులంతా కృషి చేయాలని ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. రాందాస్ అగర్వాల్ జయంతి సందర్భంగా ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ భవనంలో వైశ్య ఏక్తా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాందాస్ అగర్వాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. హాస్టల్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, ప్రతినిధులు ముత్యాలు, సత్తయ్య, మంజుల పాండయ్య, నీలా శ్రీధర్ పాల్గొన్నారు.

భక్తులకు స్వాగతం..

కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యామ్‌బాబా మందిర్‌లో నిర్వహిస్తున్న ఫాల్గుణిమేళా ఉత్సవాలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివస్తున్న భక్తులకు ఆదివారం కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ, మార్చి 17

ఇఫ్తార్ విందుకు ఒవైసీ

నాంపల్లి నియోజకవర్గం అహ్మద్‌నగర్ డివిజన్ సయ్యద్‌నగర్-2లో ఎంఐఎం నాయకుడు మహ్మద్ ఖాలెద్ షరీఫ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హైద్రాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్‌తో కలిసి పాల్గొన్నారు. – మెహిదీపట్నం, మార్చి 17

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ డివిజన్‌లోని ఒవైసీ మైదానంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను ఆదివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ. నసీరుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. – మెహిదీపట్నం, మార్చి 17

'రాయగూడని పద్యం' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 17 : మాతృక ప్రచురణలు, పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రచయిత మౌమితా ఆలం కవితలను తెలుగు అనువాదం పుస్తకం 'రాయగూడని పద్యం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీవోడబ్ల్యూ సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, కవయిత్రి విమల, రమాసుందరి, పుష్పల శ్రీరామ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఉన్నతిని సాధించాలి

కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తుల వారి స్వయం ఉపాధి కోసం కల్పిస్తున్న అవకాశాలను యువత, మహిళలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కార్వాన్ జన జాగరణ వేదిక ప్రతినిధులు అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతినిధులు యువతకు అవగాహన కల్పించారు.

– కార్వాన్, మార్చి17

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

మమతా సంతోష్ గుప్తా

అబిడ్స్, మార్చి 17 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతిని స్థాపించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో పోరాటం చేసిందని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేసే కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా న్యాయ పోరాటం చేసి నిర్దోషిగా బయటకు వస్తుందన్నారు. ఆమె అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్రంలోని గ్రామ, గ్రామాన ఆందోళనలు చేసి ఆమెకు ప్రజలు తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారని తెలిపారు.

బీసీ సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి

కాచిగూడ,మార్చి 17: దేశంలోని అన్ని రాష్ట్రాలలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు కేంద్రం తీసుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిఅడ్డా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్న బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీసీల సమగ్రాభివృద్ధికి స్వయం ఉపాధి పథకాలు, కుల వృత్తుల వారికి సబ్సిడీ రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషణ్ భాస్కర్, హెచ్.ప్రదీప్‌గౌడ్, పులిజాల కృష్ణ, నల్లెల కిశోర్, మాణిక్‌రావు, పాల్గొన్నారు.

మత్స్య.. సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా సాయికుమార్

మెట్టు సాయికుమార్

అబిడ్స్, మార్చి 17 : తెలంగాణ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. అతి చిన్న వయసులో తనకు ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్ పార్టీ నాయకునిగా రాజకీయ ప్రస్థానం చేసిన తాను రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పాటు పడినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశించగా ప్రభుత్వం తనకు చైర్మన్ పదవిని అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నట్లు ఆయన తెలిపారు.

బోయిగూడ కమాన్‌లో సంబురాలు..

ఆగాపురా బోయిగూడ కమాన్‌లో నివాసముండే సాయికుమార్‌ను తెలంగాణ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా నియమించడంతో బోయిగూడ కమాన్‌లో సంబురాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.

అభివృద్ధిని పట్టించుకోని మజ్లిస్‌ను.. చిత్తుగా ఓడించండి

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో బోనంతో బీజేపీ అభ్యర్థి మాధవీలత

అబిడ్స్, మార్చి 17: పాత బస్తీ అభివృద్ధిని పట్టించుకోని మజ్లిస్ పార్టీని రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో చిత్తుగా ఓడించి భారతీయ జనతా పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని కందికల్ గేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పల్లె చెరువు మైసమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు మాధవీలత ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సామూహిక బోనాల జాతర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మజ్లిస్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందని, పాత నగరంలో అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోని మజ్లిస్‌ను చిత్తుగా ఓడించాలని ఆమె స్థానికులకు సూచించారు. బీజేపీని గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వాడ, వాడలా అభివృద్ధి పనులను చేపడ్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ మెడికల్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ రాజశేఖర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

కవాడిగూడ, మార్చి 17: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దోమలగూడ పోలీసులు ఆదివారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ట్యాంక్‌బండ్‌పై గల గురజాడ అప్పారావు విగ్రహం వెనుక కాలిబాట వద్ద సుమారు (55) ఏండ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పెట్రోలింగ్ చేపడుతున్న పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని 108 కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి ఆ వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీలో భద్ర పరిచి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

కర్బలా మైదాన్ సమీపంలో..

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గాంధీనగర్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఎస్ఐ నాగరాజురెడ్డి తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్‌లోని జీరా రోడ్‌లో కర్బలా మైదాన్ సమీపంలో వథాన్ హోటల్ పక్కన దాదాపు (55) ఏండ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని 100 కు ఫోన్ వచ్చిందని తెలిపారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజురెడ్డి తెలిపారు.

ఎంబీసీ చైర్మన్ జైపాల్‌కు సన్మానం..

ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను సన్మానిస్తున్న ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మనుల సత్యనారాయణ, ఎత్తిరి అంతయ్య

చిక్కడపల్లి, మార్చి17 : ఎంబీసీ చైర్మన్‌గా నియమితులైన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన జెరుపటి జైపాల్‌ను ఆదివారం వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ రాజు, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్యల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ డైరెక్టర్లు ఓర్సు కృష్ణ, బండల వెంకటస్వామి, హరికృష్ణ, శ్రీరాములు, హనుమంతరావు, మోహన్‌కుమార్, గడ్డం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డిని సన్మానించిన నాయకులు

రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమితులైన జి. చిన్నారెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ మాజీ ఇన్‌చార్జ్ కె వెంకటేశ్ బేగంపేట్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. – అబిడ్స్, మార్చి 17

రంజాన్ మాసంలో ప్రజలు ఆధ్యాత్మికతను పెంచుకోవాలి

మెహిదీపట్నం, మార్చి 17: నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్ ఎ బ్యాటరీ లైన్‌లో ఉన్న జామా మసీద్‌లో ఆదివారం మసీద్ నిర్వాహకులు ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్‌ను సన్మానించారు. ఖురాన్ పఠనం నిర్విరామంగా కొనసాగుతున్న నేపథ్యంలో మసీద్ నిర్వాహకులు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రజలు రంజాన్ మాసంలో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు.

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ అఫ్సాన్ రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో మరణించాడు. ఇతడి అంత్యక్రియలు ఆదివారం మల్లేపల్లిలో జరిగాయి. ఈ అంత్యక్రియలకు హైద్రాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్‌తో కలిసి పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రగాఢ సానుభూతిని తెలిపి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, మార్చి 17